# రేవంత్‌ను మించిన మోసగాడు లేడు

- అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా ముంచేస్తాడు
- కోరుట్ల నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

మెట్‌పల్లి, నవంబర్ 5: రేవంత్‌రెడ్డిని మించిన మోసగాడు రాజకీయాల్లో లేడని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణను పూర్తిగా ముంచేస్తాడని కోరుట్ల బీజేపీ అభ్యర్థి, ఎంపీ ధర్మపురి అర్వింద్ ధ్వజమెత్తారు. రేవంత్ కన్నా సీఎం కేసీఆర్ మంచి వారని అన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆదివారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో అర్వింద్ మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ గెలిస్తే మేడిగడ్డ బరాజ్ అన్ని పిల్లర్లు మునుగుతాయని హెచ్చరించారు. రాష్ట్రంలో ఆ పార్టీకి 40 సీట్లు కూడా రావని చెప్పారు. బీజేపీకి మెజార్టీ సీట్లు వస్తాయని, హంగ్ వస్తే ప్రభుత్వాన్ని బీజేపీనే ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. మీడియా రాజకీయాలు చేస్తే తామూ చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో బీజేపీ సర్కార్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రధాని మోదీ కంకణం కట్టుకున్నారని పేర్కొన్నారు.



హనుమకొండ జిల్లా పరకాలలో బీఆర్‌ఎస్ ప్రచార రథాన్ని అడ్డుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

# కాంగ్రెస్ కార్యకర్తల దౌర్జన్యం

- బీఆర్‌ఎస్ ప్రచారరథంపై దాడి
- పరకాలలో రోడ్డుపై వెళ్తుండగా అడ్డుకొని పార్టీ ఫ్లెక్సీ చించివేత
- అడ్డుకోబోయిన పోలీసులపై హస్తం నేతల దురుసు ప్రవర్తన

పరకాల, నవంబర్ 5: ఎన్నికల ప్రచార సరళిలో కాంగ్రెస్ నాయకులు అరాచకాలు సృష్టిస్తున్నారు. తమ ఎన్నికల ప్రచారానికి ప్రజాదరణ లేకపోవడంతో ఇతర పార్టీలపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. కావాలని కవ్విస్తూ.. శాంతిభద్రతల సమస్యలకు తెరలేపుతున్నారు. హనుమకొండ జిల్లా పరకాలలో బీఆర్‌ఎస్ ప్రచార రథంపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడే ఇందుకు నిదర్శనం. కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణంలో ఆదివారం ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించింది. కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి మాట్లాడుతుండగా అటువైపుగా బీఆర్‌ఎస్ ప్రచార వాహనం వచ్చింది. ప్రజలు వాహనం వెళ్లేందుకు దారి ఇస్తున్న క్రమంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు వచ్చి బీఆర్‌ఎస్ ప్రచార వాహనాన్ని అడ్డుకొని దాడికి యత్నించారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు వారిని చెదరగొట్టేందుకు యత్నించగా దురుసుగా ప్రవర్తించారు. ఎస్సై రమేశ్‌నాయక్ కాంగ్రెస్ కార్యకర్తలను చెదరగొట్టి ప్రచార వాహనాన్ని అక్కడి నుంచి పంపిస్తుండగా.. మరికొంత మంది ప్రచార రథం వద్దకు చేరుకొని వాహనంపై ఉన్న ఫ్లెక్సీని చించివేశారు. ఎన్నికల ప్రచారంలోనే ఇన్ని ఆగడాలు, గూండాయిజం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు.. అధికారంలోకి వస్తే ఇంకెన్ని అరాచకాలు చేస్తారోనని అక్కడే ఉన్న స్థానికులు చర్చించుకోవడం వినిపించింది.


ఆదివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు ఎన్నికల ప్రచార రోడ్‌షోకు భారీగా హాజరైన ప్రజలు, పార్టీ శ్రేణులు

# ఢిల్లీ దొరలను నమ్మితే చీకటే

- తెలంగాణను నట్టేట ముంచింది వారే
- నెహ్రూ నాటి నుంచి నేటికీ అన్యాయమే
- ఇతర రాష్ట్రాల నేతలను తెస్తున్న కాంగ్రెస్
- కేసీఆర్ సింహం.. సింగిల్‌గానే వస్తారు
- ఎన్నికల ముందే కాడి పడేసిన బీజేపీ
- కల్వకుర్తి ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కల్వకుర్తి/ఆమనగల్లు, నవంబర్ 5: ఢిల్లీ దొరలను నమ్మితే తెలంగాణ భవిష్యత్ అంధకారమవుతుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ మంత్రి కే తారక రామారావు హెచ్చరించారు. తెలంగాణను నాటి నుంచి నేటికీ నట్టేట ముంచింది, ముంచుతున్నదని కాంగ్రెస్‌వారేనన్న వాస్తవాన్ని ఇక్కడి బిడ్డలు మరువొద్దని సూచించారు. ఈ ఎన్నికలు ఢిల్లీ దొరలకు, తెలంగాణ ప్రజలకు మధ్య జరుగుతున్నాయని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు మున్సిపాలిటీలో ఆదివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేటీఆర్ మాట్లాడారు. మొదటి నుంచి తెలంగాణకు కాంగ్రెస్ అన్యాయం చేస్తూ వస్తున్నదని చెప్పారు. 1956లో తెలంగాణను ఆంధ్రాలో విలీనం చేసింది రాహుల్ ముత్తాత జవహర్‌లాల్ నెహ్రూ, 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఉక్కు పాదాలతో తొక్కి 369 మందిని పొట్టన బెట్టుకున్నది రాహుల్ నాయినమ్మ ఇందిరమ్మ అని గుర్తు చేశారు. 1971లో 14 ఎంపీ సీట్లను తెలంగాణ జన సమితి గెల్చుకుంటే వారిని కాంగ్రెస్‌లో కలుపుకొని తెలంగాణ ఆకాంక్షలను వమ్ము చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా.. అంటూ ప్రశ్నించారు. 2004 నుంచి తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ బిడ్డలు ప్రాణత్యాగాలు చేస్తున్న సమయంలో ఢిల్లీలో అధికారంలో ఉన్నది ఈ దొరలే కదా! అని నిలదీశారు. కేసీఆర్ ప్రాణాలకు తెగించి సాగించిన ఉద్యమానికి తలవంచిన ఢిల్లీ దొరలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని, ఇప్పుడు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు దొరల తెలంగాణ అంటూ మాట్లాడటాన్ని ప్రజలు సహించబోరని కేటీఆర్ హెచ్చరించారు. డిసెంబర్ 3న ఫలితాలు వస్తాయని, ఆ ఫలితాల్లో ప్రజలను కన్న బిడ్డల్లా చూసుకొని పాలన సాగించిన కేసీఆర్ సర్కారు వస్తుందో.. ఢిల్లీ దొరల సర్కారు వస్తుందో చూద్దామని రాహుల్‌కు సవాల్ విసిరారు. బక్క పలచని కేసీఆర్‌ను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ నేతలకు దమ్ములేక బయట రాష్ట్రాల నుంచి నాయకులను అరువు తెచ్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సింహం సింగిల్‌గా వస్తుంది. అని కేటీఆర్ అనగానే.. సభికులు 'పందులు గుంపులుగా వస్తాయని' నినాదాలు చేశారు.


ఆమనగల్లు ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో కల్వకుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్ యాదవ్

### అస్త్ర సన్యాసం చేసిన బీజేపీ

ఎన్నికలకు ముందే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అస్త్ర సన్యాసం చేశారని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రం నుంచి బీజేపీ తట్టా బుట్టా సర్దుకుంటుందని జోస్యం చెప్పారు. ఈ మాత్రం దానికి ఢిల్లీ నుంచి ప్రధాని, హోంమంత్రి, 15 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు రాష్ట్రానికి దండయాత్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎంతమంది షేర్‌ఖాన్లు, తీస్‌మార్‌ఖాన్లు వచ్చినా.. తెలంగాణలో కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీని తట్టుకోలేరని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ డబ్బు సంచులతో వచ్చిన ప్యారాచూట్ నాయకులకు టికెట్లు ఇచ్చిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ఒక విధానం లేని పార్టీ అని ఎద్దేవా చేశారు. డబ్బు సంచులతో వస్తున్న కాంగ్రెస్ నాయకులను నమ్మవద్దని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జెడ్పీటీసీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

### కిడ్డీబ్యాంక్‌లోనే 12 వేలను కేటీఆర్‌కు అందించిన చిన్నారి

ఆమనగల్లు సభకు వచ్చిన ఓ చిన్నారి తాను కిడ్డీబ్యాంక్‌లో దాచుకున్న 12 వేల రూపాయలను మంత్రి కేటీఆర్‌కు అందజేసింది. నామినేషన్ ఖర్చులకు ఈ డబ్బును వినియోగించాలని కోరింది. చిన్నారి అభిమానానికి మంత్రి కేటీఆర్ ఉప్పొంగి పోయారు. చిన్నారి తండ్రి ఎండలి రఘు కూడా మంత్రికి గదను బహూకరించారు.

# కాంగ్రెస్‌కు అభ్యర్థులు కరువు

- వనపర్తి, చేవెళ్ల, బోథ్‌పై పునఃసమీక్ష
- వారికి బీఫారాలు ఇవ్వొద్దని అధిష్ఠానం నుంచి ఆదేశాలు
- మరో మూడునాలుగు స్థానాల్లోనూ గందరగోళం
- ఇప్పటికే పెండింగ్‌లో 19 స్థానాలు
- వలస నేతల కోసం ఎదురుచూపులు

హైదరాబాద్, నవంబర్ 5(నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ మొదలైనా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపికలో తికమకపడుతున్నది. ఇప్పటికే ప్రకటించిన కొన్ని స్థానాల్లో అభ్యర్థులను మార్చాలని అధిష్ఠానం ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. వనపర్తి, చేవెళ్ల, బోథ్ నియోజకవర్గాల అభ్యర్థులపై సమీక్షించాలని, వారికి బీ ఫారాలు ఇవ్వొద్దని అధిష్ఠానం ఆదేశించినట్టు సమాచారం. వీటితోపాటు మరో మూడు నాలుగు స్థానాల్లోనూ మార్పులు చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. తొలి జాబితాలో చేవెళ్ల(ఎస్సీ) నుంచి పామెన భీమ్‌భరత్, రెండో జాబితాలో వనపర్తి నుంచి సీనియర్ నేత చిన్నారెడ్డి, బోథ్ నుంచి వెన్నెల అశోక్‌ను అభ్యర్థులుగా ప్రకటించింది. అయితే, వీరు బలమైన అభ్యర్థులు కాదన్న అభిప్రాయానికి వచ్చిన అధిష్ఠానం వీరి మార్చాలని యోచిస్తున్నట్టు తెలిసింది. వనపర్తిలో చిన్నారెడ్డి స్థానంలో మేఘారెడ్డికి, బోథ్‌లో వెన్నెల అశోక్ స్థానంలో నరేశ్‌జాదవ్‌కు టికెట్ ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలిసింది.

### మొత్తం జాబితాపైనే అనుమానాలు

ముగ్గురు అభ్యర్థుల మార్పు నిర్ణయం నేపథ్యంలో మొత్తం జాబితాపైనే పార్టీ నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎన్ని మార్పులు ఉంటాయోనని వ్యాఖ్యానిస్తున్నారు. ఆది నుంచీ కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై ఆరోపణలున్నాయి. సర్వేల ఆధారంగానే టికెట్లు ఇస్తున్నట్టు చెప్పుకుంటున్నా దీనిని పార్టీ కార్యకర్తలు విశ్వసించడం లేదు. ఒకవేళ సర్వేల ప్రకారమే టికెట్లు ఇస్తే ఇప్పుడు మళ్లీ అభ్యర్థులను మార్చాల్సిన అవసరం ఎందుకొచ్చిందని ప్రశ్నిస్తున్నారు. ఆ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు నిర్వహించిన సర్వేలను పలువురు కీలక నేతలు ప్రభావితం చేశారనే ఆరోపణలున్నాయి. మరికొన్ని సీట్లలో కీలక నేతలు 'నాకిన్నీ.. నీకిన్నీ' చొప్పున పంచుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధిష్ఠానం వద్ద పైరవీలు చేసి తమకు అనుకూలమైన వారికి టికెట్లు ఇప్పించుకున్నట్టు పార్టీలో జోరుగా చర్చ జరుగుతున్నది. మూడు స్థానాల్లో అభ్యర్థులపై పునఃసమీక్షించాలని పార్టీ భావించడంతో ఈ ఆరోపణలు, విమర్శలకు బలం చేకూరినట్టైంది. దీంతో మిగిలిన అభ్యర్థులపై కూడా సమీక్షించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

### ఇంకా 19 స్థానాలు పెండింగ్‌లోనే..

ఒకవైపు నామినేషన్ల ప్రక్రియ మొదలైనా కాంగ్రెస్ ఇప్పటికీ 19 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. ఆయా నియోజకవర్గాల్లో సరైన అభ్యర్థులు దొరకకపోవడమే ఇందుకు కారణమని భావిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న ఇద్దరు ముగ్గురు నేతల్లో కాస్త మెరుగ్గా ఉన్న నేతకు టికెట్లు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. దీంతో మిగిలిన నేతల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన కూడా తమతో సమానమేనని, తమ కన్నా ఎక్కువేమీ కాదని మిగిలిన అభ్యర్థులు వాదిస్తున్నారు. దీంతో ఆ 19 స్థానాలకు అభ్యర్థుల జాబితాను ఒకేసారి ప్రకటించే పరిస్థితి కనిపించడం లేదు. కొన్ని పేర్లతో ఒక జాబితా, మరికొన్ని పేర్లతో మరో జాబితాను ఇచ్చే అవకాశం ఉన్నదని తెలిసింది. మిగిలిన 19 స్థానాల కోసం ఇంకా ఇతర పార్టీల నుంచి వచ్చే నేతల కోసం ఆశగా ఎదురుచూస్తున్నట్టు తెలిసింది. దీంతో సొంతంగా అభ్యర్థులను నిలుపుకోలేని మనం.. భవిష్యత్‌లో ఏం చేయగలమని సొంత పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారు.

## బీజేవైఎం నేతల రాజీనామా యోచన!

**రాష్ట్ర, జిల్లా కమిటీల సభ్యులు రాంరాం!**
**టికెట్లు ఇవ్వకపోవడంపై బీజేపీకి అల్టిమేటం**

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): బీజేపీ అనుబంధ విభాగమైన భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర, జిల్లా కమిటీల సభ్యులు మూకుమ్మడిగా రాజీనామా చేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది. ఏ క్షణంలోనైనా రాజీనామా నిర్ణయం తీసుకుంటామని పలువురు బీజేవైఎం నేతలు బాహాటంగా ప్రకటిస్తున్నారు. పోరాటాలు చేసిన తమను కనీసం పట్టించుకోవడం లేదంటూ రాష్ట్ర నాయకత్వంపై మండిపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం పది సీట్లు కేటాయించాలని ఇప్పటికే పార్టీ అధినాయకత్వానికి బీజేవైఎం విజ్ఞప్తి చేసింది. కానీ, ఇప్పటివరకు ఏ ఒక్కరికీ బీజేపీ టికెట్ కేటాయించలేదు. ఈ నేపథ్యంలోనే బీజేవైఎం నేతలు బీజేపీ అధినాయకత్వంపై గుర్రుగా ఉన్నారు. ఇలా అయితే తమకు పదవులు ఎందుకంటూ బీజేవైఎం క్యాడర్ ప్రశ్నిస్తున్నది. అదీగాక బలంలేని జనసేనతో పొత్తు ఎందుకని, దానికి కేటాయించిన సీట్లు తమకే ఇస్తే రాబోయే రోజుల్లో పార్టీకి నాయకత్వం పెరుగుతుందని బీజేవైఎం నేతలు చెప్తున్నారు. చివరి లిస్టులోనైనా కనీసం మూడు సీట్లు కేటాయించాలని యువ మోర్చాకు డిమాండ్ చేస్తున్నది. లేదంటే పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని బీజేవైఎం రాష్ట్ర, జిల్లా కమిటీలు అల్టిమేటం జారీచేశాయి.


సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో అభివాదం చేస్తున్న వైఎస్సార్టీపీ శ్రేణులు

# షర్మిలా.. తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పు

- పార్టీ శ్రేణులను అడక్కుండా కాంగ్రెస్‌కు మద్దతా?
- మీ సొంత నిర్ణయంతో ఒక నేత ఆత్మహత్యాయత్నం
- కాంగ్రెస్‌కు మద్దతిచ్చే ప్రసక్తే లేదు : వైఎస్సార్టీపీ నేతల స్పష్టీకరణ

ఖైరతాబాద్, నవంబర్ 5: పోటీలో ఉంటామని తమను నమ్మించి, ఏకపక్ష నిర్ణయంతో నట్టేట ముంచిన వైఎస్ షర్మిల తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని వైఎస్సార్టీపీ నేతలు డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యుడు, వనపర్తి ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రెడ్డి, షాద్‌నగర్ ఇన్‌చార్జి మహ్మద్ ఇబ్రహీంలు మాట్లాడుతూ.. షర్మిల వైఎస్సార్టీపీని ప్రారంభించినప్పటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం ఎంతో ఖర్చుచేశామని చెప్పారు. కానీ, షర్మిల తన నియంతృత్వ నిర్ణయంతో లక్షలాది మంది ఆశలపై నీళ్లు చల్లారని మండిపడ్డారు. కాంగ్రెస్‌తో లోపాయికారి ఒప్పందం చేసుకొని పుట్టిముంచిందని ఆరోపించారు. షర్మిలకు తెలంగాణ మీద ఎలాంటి అభిమానం లేదని, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ సంపాదనే ధ్యేయంగా పనిచేశారని విరుచుకుపడ్డారు. షర్మిల నిర్ణయంతో తూప్రాన్‌కు చెందిన ఓ నాయకుడు ఆత్మహత్యకు యత్నించాడని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని ఏ ఒక్క వైఎస్సార్టీపీ కార్యకర్త కూడా ఆ పార్టీకి మద్దతు ఇవ్వరని స్పష్టంచేశారు. త్వరలోనే తమ కార్యాచరణ ప్రకటిస్తామని, అవసరమైతే కోర్టుకు వెళ్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ నేతలు అయూబ్ ఖాన్, యర్రవరపు రమణ, వెంకటేశ్వర్‌రెడ్డి, సంజీవరావు, రామలింగారెడ్డి, వెంకట్‌రెడ్డి, క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు డేవిడ్, శాంతరాజ్, బానోత్ రాజ్‌కుమార్, నర్సింహారెడ్డి, లక్ష్మయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు అమ్ముకున్నోడికి టికెట్!

- రేవంత్ ఒత్తిళ్లకు తలొగ్గిన అధిష్ఠానం
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జంగా ఫైర్

కాజీపేట, నవంబర్ 5: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్లను అమ్ముకొన్న నాయిని రాజేందర్‌రెడ్డికి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి టికెట్ కేటాయించడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని డీసీసీబీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జంగా రాఘవరెడ్డి మండిపడ్డారు. హనుమకొండ జిల్లా కాజీపేటలో వరంగల్ పశ్చిమ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన రాఘవరెడ్డి మాట్లాడుతూ.. పార్టీని కష్టకాలంలో ఆదుకున్న వారికే టికెట్ ఇస్తామని గతంలో రాహుల్ గాంధీ చెప్పారని, ఇప్పుడు కొత్తగా పార్టీలో చేరిన వారికి టికెట్లు ఇచ్చి తనలాంటి సీనియర్ నాయకులకు అన్యాయం చేయడం సరికాదని అన్నారు. ఒత్తిళ్లకు తలొగ్గి అధిష్ఠానం గెలిచే వ్యక్తులకు టికెట్ ఇవ్వకుండా తీరని అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ పశ్చిమలో గెలిచే సత్తా తనకున్నదని, పార్టీ పునరాలోచించి టికెట్ కేటాయించాలని కోరారు. ఒకవేళ తనకు కాంగ్రెస్ టికెట్ రాకుంటే ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పోటీలో ఉంటానని స్పష్టంచేశారు.


హనుమకొండ జిల్లా కాజీపేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత జంగా రాఘవరెడ్డి

# టీకాంగ్రెస్‌ను నడిపిస్తున్న ఏపీ నేతలు

- తెలంగాణపై షర్మిల, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ దండయాత్ర
- కాంగ్రెస్‌కు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేశ్ ముదిరాజ్ రాజీనామా
- టీపీసీసీ కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ సైతం గుడ్‌బై

ముషీరాబాద్, నవంబర్ 5: ఏ ఆంధ్రా పాలకుల పెత్తందారీ వ్యవస్థ పోవాలని కొట్లాడామో, నేడు తెలంగాణ కాంగ్రెస్ నేతల పుణ్యమా అని మళ్లీ వారి దండయాత్ర మొదలైందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేశ్ ముదిరాజ్ ఆరోపించారు. టీ కాంగ్రెస్‌ను వెనుక ఉండి నడిపించడానికి వైఎస్ షర్మిల, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ముందుకొస్తున్నారని ఆరోపించారు. పార్టీలు, సిద్ధాంతాలను పక్కన పెట్టి కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవడం ఉద్యమకారులను అవమానించడమేనని మండిపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ పెద్దల తీరు నచ్చక పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఆదివారం రాంనగర్‌లో మీడియాతో నాగేశ్ మాట్లాడుతూ.. తెలంగాణలో వైఎస్ షర్మిలకు ఉన్న బలం, బలగం ఎంత? క్యాడర్ ఎంత? షర్మిలకు కాంగ్రెస్ పార్టీకి ఏం సంబంధం ఉన్నదని ప్రశ్నించారు. షర్మిల మద్దతు అవసరం అన్నట్టు భట్టి విక్రమార్క మాట్లాడటం శోచనీయమని అన్నారు. కాంగ్రెస్‌లో బీసీలపై చిన్న చూపు ఉన్నదని.. బీసీ, అట్టడుగు వర్గాల నేతలను రాజకీయంగా అణగదొక్కుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.



### దేవరకద్ర కాంగ్రెస్‌కు భారీ షాక్

మూసాపేట, నవంబర్ 5: టీపీసీసీ కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో 8 మండలాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. రేవంత్ పార్టీలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ జెండామోసిన వారికి గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.

### 20 ఏండ్లుగా పార్టీకి పనిచేస్తున్నా గుర్తింపు లేదు

గంగాధర, నవంబర్ 5: ఇరవై ఏండ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్నా గుర్తింపు లేదని కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భానుప్రియ ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్‌లో ఆమె మాట్లాడుతూ.. చొప్పదండి నియోజకవర్గంలో మాదిగ సామాజిక వర్గం అధికంగా ఉన్నా కాంగ్రెస్ టికెట్‌ను మాదిగలకు ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

# చెన్నూర్‌లో కాంగ్రెస్‌కు భారీ షాక్

మంచిర్యాల, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్‌కు భారీ షాక్ తగిలింది. చెన్నూర్ నియోజకవర్గంలో ఆ పార్టీ నుంచి టికెట్ ఆశించిన ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి బోడ జనార్దన్ సహా డాక్టర్ రాజారమేశ్ ఇద్దరూ ఒకే రోజు రాజీనామా చేశారు. ముందు నుంచి చెన్నూర్‌లో కాంగ్రెస్ జెండాను నిలబెట్టామని.. కానీ అధిష్ఠానం తమకు వెన్నుపోటు పొడిచిందని డాక్టర్ రాజారమేశ్ పేర్కొన్నారు. టికెట్ ఇస్తామని నమ్మించి ఉన్న ఫలంగా ప్రత్యర్థి పార్టీ నుంచి వచ్చిన వ్యాపారవేత్తకు స్వాగతం పలకడంపై అసహనం వ్యక్తం చేశారు. ముందుగా చెన్నూర్ టికెట్‌పై హామీ ఇవ్వడం, వివేక్ చేరిన అనంతరం పెద్దపల్లి పార్లమెంట్ స్థానంపై స్పష్టత రాకపోవడంతో ఆయన పార్టీ నుంచి వైదొలిగినట్టు తెలిసింది. ఈ మేరకు రాజీనామా లేఖను రేవంత్‌రెడ్డికి ఫ్యాక్స్ చేసినట్టు సమాచారం. కాగా మంగళవారం చెన్నూర్ సభలో బోడ జనార్దన్ బీఆర్‌ఎస్‌లో చేరనున్నట్టు సమాచారం.

**నిపుణ** విద్య, ఉద్యోగ సమాచారం

## సీటెట్

**సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) నోటిఫికేషన్‌ను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విడుదల చేసింది.**

- **పరీక్ష పేరు:** సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) జనవరి-2024
- **పేపర్లు:** రెండు పేపర్లు ఉంటాయి. 1-5వ తరగతి వరకు బోధించాలనుకునే వారు మొదటి పేపర్, 6-9వ తరగతి వరకు బోధించాలనుకునే వారు రెండో పేపర్‌ను రాయాలి.
- ఒక్కసారి సీటెట్‌లో అర్హత సాధిస్తే లైఫ్ లాంగ్ వ్యాలిడిటీ ఉంటుంది.
- అర్హతలు, పరీక్ష విధానం తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 23
- **వెబ్‌సైట్:** https://ctet.nic.in

## పవర్‌గ్రిడ్‌లో

**పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో గేట్-2023 స్కోర్ ఆధారంగా కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 184
- **పోస్టులు:** ఇంజినీర్ ట్రెయినీ
- **విభాగాలు:** ఎలక్ట్రికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 10
- **వెబ్‌సైట్:** https://www.powergrid.in

## ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- ఎకానమీ, ఫిజిక్స్, మ్యాథ్స్ (గ్రూప్స్, నీట్) మెటీరియల్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.